క్లుప్తంగా

వెంకన్నను దర్శించుకున్న మంత్రి విశ్వరూప్



స్వామివారి రథానికి పూజలు చేసిన మంత్రి విశ్వరూప్ తదితరులు

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న కల్యాణోత్సవాల్లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ శుక్రవారం పాల్గొన్నారు. తొలుత స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న మంత్రి విశ్వరూప్ అనంతరం రథోత్సవానికి సిద్ధం చేసిన రథాన్ని సందర్శించి పూజలు చేశారు. కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామగోపాల్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ పట్టణ యువజన కమిటీ అధ్యక్షుడు దూడల ఫణి, దేవస్థానం ధర్మకర్త నడింపల్లి వర్మ, స్వామి, అబ్బిరెడ్డి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మాక్ డ్రిల్‌తో అగ్ని ప్రమాదాలపై అవగాహన



కిమ్స్ ఆస్పత్రి ఆవరణలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారులు

అమలాపురం టౌన్: స్థానిక కిమ్స్ వైద్య కళాశాల, ఆస్పత్రిలో శుక్రవారం అమలాపురం అగ్నిమాపక సిబ్బంది మాక్ డ్రిల్ చేసి అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక దళాధికారి కేవీ మురళీ కొండబాబు, లీడ్ ఫైరింగ్ మెన్ మట్టపర్తి బలరామ్, సిబ్బంది అగ్ని మాపక యంత్రాలు, పరికరాలను ప్రయోగాత్మకంగా ప్రదర్శించారు. అగ్ని ప్రమాదం అనివార్యమైతే ఎలా స్పందించాలి, ఎలా మంటలను అదుపు చేయాలి, ప్రమాద తీవ్రత పెరగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఆస్పత్రి వైద్యులు, సిబ్బందికి అగ్నిమాపక దళాధికారి కొండబాబు వివరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న 33/11 కేవీ లైన్‌లో వార్షిక మరమ్మతుల నిమిత్తం పి.మల్లవరం, జార్జిపేట, పోలేకుర్రు, గాడిమొగ, కోరంగి, తాళ్లరేవు పంచాయతీల పరిధిలోని అన్ని గ్రామాలకు శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని కాకినాడ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

21న సీనియర్ సాఫ్ట్ టెన్నిస్ జట్ల ఎంపిక

తాళ్లరేవు: కాకినాడ జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21న జిల్లా సీనియర్ సాఫ్ట్ టెన్నిస్ జట్ల ఎంపికలు కాకినాడ డీఎస్ఏ క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు సంఘ కార్యనిర్వాహక కార్యదర్శి నీలిమ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జట్లు కర్నూలులో జరగనున్న రాష్ట్ర స్థాయి సీనియర్ సాఫ్ట్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటాయన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు 21వ తేదీ ఉదయం 8 గంటలకు జన్మదిన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డ్ జిరాక్స్ కాపీ, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో హాజరుకావాలని సంఘ అధ్యక్షుడు సాయిబాబా కోరారు.

చలివేంద్రం ఏర్పాటు

అమలాపురం రూరల్: తాళ్ల సరస్వతమ్మ ముత్యాలు చారిటబుల్ ట్రస్ట్ సెక్రటరీ టీఎస్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో అమలాపురం మండలం పేరూరు వైజంక్షన్ వద్ద మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, బులుసు జగదీష్, గంధం పల్లంరాజులు శుక్రవారం చలివేంద్రాన్ని ప్రారంభించి పాదచారులకు మజ్జిగ అందజేశారు. కార్యక్రమంలో ఆజాద్ ఫౌండేషన్ అధ్యక్షుడు యల్లమిల్లి నాగసుధా కొండ, తాళ్ల సాంబమూర్తి, నాతి శ్రీను, టి.ప్రసాద్, గోకరకొండ సూరిబాబు, ఇందుగుల ఆనంద్ పాల్గొన్నారు.

జయంతీరావు ఆదర్శనీయుడు

ఉప్పలగుప్తం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జయంతీరావు ఆదర్శనీయుడని జిల్లా దళిత ఐక్య వేదిక కన్వీనర్ జంగా బాబురావు అన్నారు. మండలంలోని ఎస్.యానంలో శుక్రవారం జయంతీరావు నాలుగో వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇసుకపట్ల రఘుబాబు, పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవ తిరుపతిరావు, గెద్దాడ బుద్ధరాజు, ముత్తాబత్తుల శ్రీను, మెండు డేవిడ్ అంబేడ్కర్ పాల్గొన్నారు.

ముగిసిన భావజాల వారోత్సవాలు

ఐ.పోలవరం: మండల కేంద్రమైన ఐ.పోలవరంలో ఈ నెల 11 నుంచి 19 వరకూ నిర్వహించిన పూలే-అంబేడ్కర్ భావజాల వారోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. పి.వెంకటేశ్వరరావు అధ్యక్షతన వేసవి విజ్ఞాన సంబరాలుగా జరుపుకున్న వారోత్సవాలు మంచి స్ఫూర్తిని కలిగించాయని ముగింపు సభలో వక్తలు తెలిపారు. అనంతరం బహుమతి ప్రదానం జరిగింది. కార్యక్రమంలో ఏవీ రత్నం, పత్తి సత్తిబాబు, డాక్టర్ జె.శ్రీనివాస్, వి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా పొన్నాడ నామినేషన్

- బ్రహ్మరథం పట్టిన పార్టీ నాయకులు, అభిమానులు
- ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు హాజరు



నామినేషన్ వేసేందుకు పాదయాత్రగా వెలుతున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్



రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ

ముమ్మిడివరం: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ శుక్రవారం తన నామినేషన్ దాఖలు చేశారు. అమలాపురం పార్లమెంట్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు, పలువురు పార్టీ నాయకులు వెంట రాగా మూడు సెట్ల నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.మదన్ మోహ నరావుకు అందజేశారు. పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అభ్యర్థిత్వాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు పెన్మత్స చినరామభద్రిరాజు(చిట్టిరాజు), సంసాని నాగేశ్వరరావు, యేడిద చక్రపాణిరావులు బలపరిచారు. అలాగే పొన్నాడ సతీష్‌కుమార్ సతీమణి పొన్నాడ నీరజ మరో సెట్ నామినేషన్ పత్రాన్ని రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. ఆమె అభ్యర్థిత్వాన్ని దున్నా జనార్ధనరావు బలపరిచారు.

వైఎస్సార్ సీపీని గెలిపించండి

రాష్ట్రంలో పేదల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఆగకుండా అమలు జరగాలంటే వైఎస్సార్ సీపీని గెలిపించుకోవాల్సిన అవసరముందని అమలాపురం పార్లమెంట్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు, ముమ్మిడివరం అసెంబ్లీ అభ్యర్థి పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌లు అన్నారు. పొన్నాడ నామినేషన్ వేసిన అనంతరం రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి బయటకు వచ్చిన ఎమ్మెల్యే పొన్నాడకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందిస్తూ మేలు చేస్తున్న సంక్షేమ రథ సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలందరూ మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాను గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీకి అఖండ విజయాన్ని అందించాలని కోరారు.

తరలి వచ్చిన పార్టీ శ్రేణులు

ముమ్మిడివరం అసెంబ్లీ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ నామినేషన్ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. నియోజకవర్గంలో ముమ్మిడివరం, కాట్రేనికోన, తాళ్లరేవు, ఐ.పోలవరం మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలి వచ్చారు. అన్ని గ్రామాల నుంచి మోటారు సైకిళ్లు, ఆటోలు, కార్లు తదితర వాహనాలలో ముమ్మిడివరం కొండాలమ్మ చింత వద్దకు చేరుకున్నారు. పొన్నాడ ముందుగా కొండాలమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి అమలాపురం పార్లమెంట్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు, పితాని బాలకృష్ణతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి పాదయాత్రగా రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకుని ఉదయం 11.14 గంటలకు ఆయన నామినేషన్ దాఖలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీలు కోలా గంగా భవానీ, మోర్త మిరియాం జ్యోతి, పాలెపు లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు కుడిపూడి శంకరరావు, నేలకిశోర్, ముదునూరి సతీష్‌రాజు, దొమ్మేటి శామ్యూల్ సాగర్, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, సీనియర్ నాయకులు పెయ్యల చిట్టిబాబు, ఢిల్లీ నారాయణ, నడింపల్లి సూరిబాబు, కాశి బాల మునికుమారి, కోలా బాబ్జీ, మండల పార్టీ కన్వీనర్లు జగతా పద్మనాభం, పిన్నమరాజు వెంకటపతిరాజు, నల్లా నరసింహమూర్తి, కాదా గోవిందకుమార్, సర్పంచులు దంతులూరి రాఘవరాజు, కాశీ రాజబాబు, పండు నళిని, ఆలయ చైర్మన్ పెనుమత్స వాసురాజు పాల్గొన్నారు.

మంత్రి విశ్వరూప్‌కు బీ ఫారం అందజేత



మంత్రి విశ్వరూప్‌కు బీఫారం అందిస్తున్న హరిప్రసాద్‌రెడ్డి

అమలాపురం రూరల్: అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌కు వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం నుంచి బీ ఫారం అందించారు. వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాయలసీమ ఇన్‌చార్జి హరిప్రసాద్‌రెడ్డి భట్నవెల్లిలోని మంత్రి క్యాంప్ కార్యాలయానికి శుక్రవారం విచ్చేసి మంత్రి విశ్వరూప్‌కు బీఫారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లిబోయిన శ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరిరామ్‌గోపాల్, డాక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు ఐదు నామినేషన్ల దాఖలు



నామినేషన్ దాఖలు చేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ సతీమణి నీరజ

ముమ్మిడివరం: ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి రెండో రోజు ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, ఆయన సతీమణి పొన్నాడ నీరజ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పాలెపు ధర్మారావు, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా సత్తిరాజు ఎస్‌వీయూ వీఆర్ఎస్ స్వామి, బీర రాజ్ కుమార్‌లు తమ నామినేషన్ పత్రాలను స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.మదన్‌మోహనరావుకు అందజేశారు.

వైభవంగా వెంకన్న రథోత్సవం

– రథాన్ని లాగేందుకు పోటీ పడిన భక్తులు



అమలాపురం పురవీధుల్లో వేలాది మంది భక్తుల నడుమ సాగుతున్న వేంకటేశ్వరస్వామి రథోత్సవం

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం రథోత్సవం, తీర్థం అత్యంత వైభవంగా జరిగాయి. రథోత్సవం, తీర్థాన్ని తిలకించేందుకు కోనసీమ వ్యాప్తంగా వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. రథాన్ని పూలమాలలు, మామిడి తోరణాలు, అరటి గెలలతో అలకంరించారు. తొలుత రథం వద్ద అబ్బిరెడ్డి సురేష్, సుధారాణి దంపతులు హోమాన్ని నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కల్యాణోత్సవాల ప్రత్యేక అధికారి, అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఈఓ వి.సత్యనారాయణ, జిల్లా దేవాదాయశాఖ అధికారి డి.నాగమల్లేశ్వరరావుల ఆధ్వర్యంలో రథోత్సవం ప్రారంభించారు. దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవి, ఈఓ దూనబోయిన సాయిబాబు, ధర్మకర్తలు, అర్చకులు రథోత్సవాన్ని పర్యవేక్షించారు. వేంకటేశ్వరస్వామి దేవస్థానం నుంచి సాయంత్రం 4.02 గంటలకు కదిలిన రథం స్థానిక మహిపాలవీధి, పుల్లయ్య రామాలయ సెంటరు, గాంధీ బజార్, మాచిరాజు వీధి, గండువీధి, గారపాటి వీధి మీదుగా తిరిగి దేవస్థానం వరకూ రథోత్సవం సాగింది. వేలాది మంది భక్తులు గోవింద నామ స్మరణ నడుమ రథం ముందుకు కదిలింది. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. రథం ముందు భారీ పోలీసు బలగాలు, వెనుక అగ్ని మాపక దళం వెంట సాగాయి. దేవస్థానానికి ఎదురుగా ఉన్న 216 జాతీయ రహదారి వెంబడి తీర్థం కన్నుల పండువగా జరిగింది. జాతీయ రహదారిపై దాదాపు కిలోమీటరు మేర భక్తుల రద్దీ కనిపించింది. దాదాపు 45 అడుగుల ఎత్తుతో ఉన్న రథం పుర వీధుల్లో సజావుగా సాగేలా విద్యుత్ శాఖ ఆ రోడ్లకు అటూ ఇటూ ఉన్న ప్రాంతాల్లో శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. రథోత్సవం వల్ల దేవస్థానం పరిసరాల్లో ఉన్న దాదాపు 17 వీధులు, ప్రాంతాలకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది.

దారులన్నీ కాకినాడకే



అమలాపురం నుంచి ప్రత్యేక బస్సుల్లో కాకినాడ సిద్ధం సభకు బయలుదేరుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

సిద్ధం సభకు తరలి వెళ్లిన పార్టీ శ్రేణులు



మొగళ్లమూరు నుంచి సిద్ధం సభకు వెళ్తున్న అభిమానులు

అమలాపురం టౌన్/అల్లవరం/ఉప్పలగుప్తం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న మేమంతా సిద్ధం సభకు అమలాపురం నియోజకవర్గం నుంచి వేలాది మంది వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం మధ్యాహ్నం తరలి వెళ్లారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, అమలాపురం ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్ ఆధ్వర్యంలో దారులన్నీ కాకినాడకే అన్నట్లుగా వందలాది వాహనాలు కాకినాడ సిద్ధం సభకు బయలుదేరి వెళ్లాయి. అమలాపురం పట్టణం సూర్యనగర్ నుంచి పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సుల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు కాకినాడకు బయలుదేరి వెళ్లారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ జిల్లా బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, మున్సిపల్ కౌన్సిలర్లు కాకినాడకు పయనమయ్యారు.

- ఉప్పలగుప్తం మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, నాయకులు, ప్రజా ప్రతినిధులు శుక్రవారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కాకినాడ జిల్లాలో నిర్వహించిన మేమంతా సిద్ధం సభకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా మండలం నుంచి బయలుదేరిన బస్సులను బాబ్జి జెండా ఊపి ప్రారంభించారు.
- కాకినాడలో నిర్వహించిన మేమంతా సిద్ధం బహిరంగ సభకు అల్లవరం మండలం నుంచి వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షులు కొనుకు బాపూజీ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు భారీగా పయనమై వెళ్లారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, గృహ సారథుల మండల కన్వీనర్ తిక్కా ప్రసాద్, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, ఎస్సీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నాతి శ్రీనివాసరావు, యూత్ అధ్యక్షులు బళ్ల శ్యామ్, సర్పంచ్‌లు రాయుడు విష్ణు, ఏఎంసీ డైరెక్టర్ పాటి శ్రీరామ్, టీఏసీ మెంబర్ కుడుపూడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయం వద్ద దాతల వితరణ



భక్తులకు మజ్జిగ అందజేస్తున్న గాంధీనగర్, మహిపాలవీధి యువత

అమలాపురం టౌన్: స్థానిక వెంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద శుక్రవారం జరిగిన స్వామి వారి తీర్థం, రథోత్సవానికి హాజరైన వేలాది మంది భక్తుల కోసం పలువురు దాతలు అన్న, ప్రసాద వితరణతో పాటు చలివేంద్రాల ద్వారా దాహార్తిని తీర్చారు. అమలాపురం అబ్బిరెడ్డి రామదాసు ఫౌండేషన్ ట్రస్ట్, శ్రీ తిరుమల వెంకటేశ్వర జనరల్ మర్చంట్స్ ప్రతినిధులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌కు చెందిన న్యాయవాది బసవా వీర వెంకట సత్యనారాయణమూర్తి, వెంకటరమణ దంపతులు భక్తులకు పులిహోర ప్రసాదాన్ని సమకూర్చారు. స్థానిక గాంధీనగర్, మహిపాల వీధి యువత ఆధ్వర్యంలో గాంధీనగర్ ఆర్చి వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంలో మజ్జిగ, పానకం అందించారు. స్థానిక ఎర్ర వంతెన వద్ద నల్లా ప్రసాద్ ఏర్పాటుచేసిన చలి వేంద్రాన్ని అమలాపురం రూరల్ సీఐ పి.వీరబాబు ప్రారంభించారు. బీజేపీ కిసాన్ మోర్చ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్ బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. స్థానిక బ్యాంక్ స్ట్రీట్‌లోని జీవీ మాల్ వద్ద ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని మాల్ భవన యాజమాని ప్రసాద్ ప్రారంభించారు.

కొనసాగుతున్న దాడులు, తనిఖీలు



చెక్‌పోస్టులో వాహనాలను తనిఖీ చేస్తున్న నిఘా బృందం

అమలాపురం టౌన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అక్రమ రవాణాను అడ్డుకునేందుకు జిల్లా పోలీసు శాఖ, ఎస్ఈబీ, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలు జిల్లాలో దాడులు, తనిఖీలు విస్తృతంగా నిర్వహిస్తున్నాయి. జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ దాడులు, తనిఖీల వివరాలకు సంబంధించి జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి శుక్రవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు.

- అమలాపురం, రామచంద్రపురం, కొత్తపేట, రాజోలు, ఆలమూరు ఎస్ఈబీ స్టేషన్ల పరిధిలో విస్తృత దాడులు జరిపి ఆరుగురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 6,240 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 104 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 1141.74 లీటర్ల ఇండియన్ మేడ్ లిక్కర్, 2 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. 450 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసంచేశారు.
- జొన్నాడ, గోపాలపురం, బొబ్బర్లంక, దిండి, ఎదుర్లంక, నరసాపురపుపేటల్లో ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్ పోస్టుల్లో నిఘా బృందాలు పలు వాహనాలు ఆపి శుక్రవారం విస్తృత తనిఖీలు నిర్వహించాయి.
- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, గ్రామాలైన రామచంద్రపురం పట్టణంలోని గంగునల్లవీధి, మండలంలోని పలు గ్రామాల్లో పోలీసు అధికారులు కేంద్ర బలగాలతో కలిసి శుక్రవారం సాయంత్రం కవాతు నిర్వహించారు.

10 మంది వలంటీర్ల రాజీనామా



సుంకరపాలెంలో రాజీనామాలు చేసిన గ్రామ వలంటీర్లు

తాళ్లరేవు: మండల పరిధిలోని సుంకరపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న 10 మంది వలంటీర్లు శుక్రవారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. ఈ మేరకు తమ రాజీనామా పత్రాలను గ్రామ పంచాయతీ కార్యదర్శి వి.జ్యోతిసుధకు అందజేసినట్లు వారు తెలిపారు. తమకు ఎంతో గౌరవం ఇచ్చిన తమ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయం కోసం తాము పనిచేసేందుకే రాజీనామాలు చేస్తున్నట్లు తెలిపారు.

జిల్లాలో 563 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు

అమలాపురం రూరల్: జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 1,644 పోలింగ్ కేంద్రాలు ఉండగా వాటిలో 563 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలున్నాయని జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థికి నామినేషన్ దాఖలు చేసే సమయానికి 25 ఏళ్లు పూర్తై ఉండాలన్నారు. ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు సాధారణ కేటగిరీ అభ్యర్థులు రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. పార్లమెంట్ సభ్యునిగా పోటీ చేసేందుకు సాధారణ కేటగిరీ అభ్యర్థులు రూ.25 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.12,500 డిపాజిట్ చెల్లించాలన్నారు. నామినేషన్ దాఖలు చేయడానికి 48 గంటల ముందు అభ్యర్థులు తప్పనిసరిగా తమ పేరిట ఏదైనా గుర్తింపు పొందిన బ్యాంకు ఖాతా తెరవాలన్నారు. ఆ ఖాతా ద్వారానే తమ ఎన్నికల ప్రచారానికీ, ఇతర అవసరాలకు వెచ్చించిన సొమ్ములకు సంబంధించిన లావాదేవీలు నిర్వహించాలన్నారు. నామినేషన్ దాఖలు చేసే సమయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నోటరీతో కూడిన అఫిడవిట్ సమర్పించాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులపై ఏవైనా క్రిమినల్ కేసులుంటే, వాటిని మూడు దినపత్రికల్లో ప్రకటన ద్వారా బహిర్గతం చేసి అందుకు అయ్యే ఖర్చును లెక్క చూపాలన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

అల్లవరం: వేసవి నేపథ్యంలో మండలంలోని 21 పంచాయతీల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ కృష్ణమోహన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పీడబ్ల్యూఎస్, ఆర్‌డబ్ల్యూఎస్ పథకాలకు సంబంధించి విద్యుత్ మోటార్ల పనితీరుని నిత్యం పర్యవేక్షించాలన్నారు. ఎక్కడైనా మోటార్లు చెడిపోతే వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది మంచి నీటి బావులు, బోర్లకి మరమ్మతులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు రాజమోహన్, పి.శ్రీనివాస్, శ్రీరామచంద్రమూర్తి, దుర్గా శ్రీనివాస్, కనకమ్మ, మృదుల పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

తాళ్లరేవు: మండల పరిధిలోని సుంకరపాలెం పంచాయతీలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు సర్పంచ్ టిళ్లపూడి నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం స్థానిక గ్రామ పంచాయతీలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో తాగునీటి సమస్య నెలకొందని పలువురు ప్రస్తావించడంతో పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు ఆయన బదులిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వి.జ్యోతి సుధ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

- పుదుచ్చేరి లోక్‌సభకు జరిగిన ఎన్నిక
- స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకున్న ప్రజలు



కనకాలపేటలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

యానాం: పుదుచ్చేరి పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించి జరిగిన ఎన్నికలో కేంద్రపాలితప్రాంతం యానాంలో శుక్రవారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం మందకొడిగా ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం తర్వాత పుంజుకుంది. యానాం నియోజకవర్గ పరిధిలో మొత్తం 33 పోలింగ్ బూత్‌లను ఏర్పాటుచేశారు. ఈ ఎన్నికల్లో మొత్తంగా 26 మంది అభ్యర్థులు బరిలో ఉండటంతో రెండేసి చొప్పున బ్యాలెట్ యూనిట్లను బూత్‌లలో అందుబాటులో ఉంచారు. పోలింగ్ కోసం ప్రిసైడింగ్ ఆఫీసర్లు, పోలింగ్ ఆఫీసర్లు తదితర 180 మంది సిబ్బందిని నియమించారు. నియోజకవర్గ పరిధిలో ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగానికి స్వచ్ఛందంగా ఆయా బూత్‌ల వద్దకు వచ్చారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా పోలింగ్ సాగింది. ఎస్పీ రాజశేఖరన్, సీఐ షణ్ముగం, ఎస్ఐ మురుగానందన్ తదితరుల ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మునిస్వామి నియోజకవర్గ పరిధిలోని పలు పోలింగ్ బూత్‌లను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ ఓటింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు.



ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే అశోక్ కుటుంబ సభ్యులు



ఓటు హక్కు వినియోగించుకున్న మల్లాడి కృష్ణారావు కుటుంబీకులు

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

స్థానిక వెటర్నరీ ఆసుపత్రి వద్ద ఉన్న పోలింగ్ బూత్‌లో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఆయన తల్లి భారతి, చిన్నాన్న వీర్రాజు ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఆయన భార్య ఉదయలక్ష్మి, కుమారుడు వంశీ, కాంగ్రెస్‌కు మద్దతుగా ఉన్న ఇన్‌చార్జి మల్లాడి సత్తిబాబు, పుదుచ్చేరిలో సీఎం రంగసామి, ఎన్డీయే అభ్యర్థి నమశ్శివాయం, కాంగ్రెస్ అభ్యర్థి వైద్దిలింగం తదితరులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. యానాం పట్టణంలో శుక్రవారం ఉదయం ఓటేసేందుకు తక్కువ మంది వచ్చినా మధ్యాహ్నం నుంచి అధిక సంఖ్యలో ఓటర్లు రావడంతో పలు బూత్‌ల వద్ద క్యూలైన్లు కిక్కిరిశాయి. కనకాలపేట, సావిత్రినగర్, గిరియాంపేట, దరియాలతిప్ప, పరంపేట తదితర గ్రామాల్లోని బూత్‌ల్లో సాయంత్రం 6 తర్వాత కూడా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

తగ్గిన పోలింగ్ శాతం

నియోజకవర్గంలో ఓటర్లు మొత్తం 39,408 మంది ఉన్నారు. ఉదయం 7 గంటలకే పోలింగ్ ప్రారంభమైంది. ఉదయం 9 గంటలకు 12.59 శాతం, 11 గంటలకు 27.35 శాతం, మధ్యాహ్నం 1 గంటకు 43.66 శాతం, మధ్యాహ్నం 3 గంటలకు 56.29 శాతం, సాయంత్రం 5 గంటలకు 70.59 శాతం, సాయంత్రం 6 గంటలకు 75.79 శాతం పోలింగ్ నమోదైంది. 2019లో యానాం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 86.45 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. గతం కంటే ఈ దఫా పోలింగ్ శాతం తగ్గినట్లుగా అధికారులు చెబుతున్నారు. యానాంలోని గిరియాంపేట, అయ్యన్ననగర్ ప్రాంతాల్లోని 10 బూత్‌ల్లో రాత్రి 8 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. నిర్ణీత సమయం ముగిసే సమయానికి ఓటు వేయకుండా క్యూలైనులో ఉండిపోయినవారికి ముందస్తుగా కూపన్లు ఇచ్చి రాత్రి 8 గంటల వరకూ ఓటింగ్‌లో పాల్గొనేలా ఎన్నికల సిబ్బంది సహకరించారు.

యానాం నియోజకవర్గంలో మొత్తంగా 77.33 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 30,476 మంది ఓటు హక్కు వినియోగించుకోగా వాటిలో మహిళలు 15,655 మంది, పురుషులు 14,821 మంది ఉన్నారు. ఈ మేరకు వివరాలను శుక్రవారం రాత్రి 9 గంటలకు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మునిస్వామి అధికారికంగా వెల్లడించారు.